

సాక్షి
బాపట్ల
శనివారం । 31 । మే । 2025



గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వానకు నగరంలో రహదారులన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముడి వెండి సమర్పణ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి తెనాలికి చెందిన కడియాల సుధీర్ కుటుంబం రూ. 3.50 లక్షలు విలువగల 3.6కేజీల ముడివెండిని సమర్పించింది.

న్యూస్‌రీల్

జవహర్ నవోదయ కోసం స్థల పరిశీలన

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం అద్దంకి నియోజక వర్గానికి జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసింది. విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూ అధికారులు శుక్రవారం అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి 25 ఎకరాల భూమి కావాల్సి ఉంది. బల్లికురవ తహసీల్దార్ రవినాయక్ వల్లాపల్లి గ్రామంలోని పేరంటాళ్ల తల్లి ఆలయం సమీపంలో, గుంటుపల్లి గ్రామంలోని సచివాలయం సమీపవంలో భూములను పరిశీలించారు. జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

కోన నీరజకు టైమ్స్ పవర్ ఉమెన్ అవార్డు



బాపట్ల: సినీ ఇండస్ట్రీలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్‌గా, దర్శకురాలుగా పనిచేస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కుమార్తె కోన నీరజకి ది టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకమైన టైమ్స్ పవర్ ఉమెన్ అవార్డు దక్కింది. ఈమేరకు గురువారం హైదరాబాదులో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. సినీ ఇండస్ట్రీలో వెలుగొందడంతో పాటు పుస్తక రచయితగా, దర్శకురాలుగా ఆమె శక్తివంతమైన మహిళగా రూపుదిద్దుకుంటున్నారని ది టైమ్స్ ఆఫ్ ఇండియా సంస్థ కొనియాడింది. ఈ సందర్భంగా కోన రఘుపతి తన కుమార్తె కోన నీరజకు శుభాకాంక్షలు తెలియజేశారు. నీరజ అవార్డు అందుకోవడం బాపట్ల ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

ఫిరంగిపురం: ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లే మార్గంలోని అల్లంవారిపాలెం వద్ద ఉన్న రైల్వేగేటు ఎల్‌సీ 298కి శనివారం నుంచి అత్యవసర మరమ్మతులు నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ నల్లపాడు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పి. ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం నుంచి జూన్ మూడో తేదీ వరకు గేటు మూసివేస్తామన్నారు. ప్రత్యామ్నాయంగా ఆరోగ్యనగర్ వద్ద ఉన్న అండర్ పాస్‌ను వాహనదారులు వినియోగించుకోవాలని సూచించారు.

రైల్వే గడ్డర్‌ను ఢీకొన్న భారీ వాహనం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రైల్వే ట్రాక్ వద్ద ఏర్పాటుచేసిన రైల్వే గడ్డర్‌ను ఓ భారీ వాహనం ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం రైల్వేట్రాక్ అండర్‌పాస్ వద్ద భారీ వాహనాల రాకపోకల నిషేధానికి ఏర్పాటు చేసిన రైల్వే గడ్డర్‌ను చూసుకోకుండా వాహన డ్రైవర్ ఢీకొట్టాడు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ రైల్వే గడ్డర్‌ను తరచూ భారీ వాహనాలు ఢీకొంటున్నాయని, ఆ గడ్డర్ వద్ద సరైన సూచిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనాల డ్రైవర్లకు అంచనా లేకపోవడంతో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వీసీ ఆచార్య కె గంగాధరరావు



ఏఎన్‌యూ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వీసీ ఆచార్య కె గంగాధరరావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అధికారులు, సిబ్బంది, పరిశోధకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనివర్సిటీ యోగా సెంటర్‌లో యోగా సాధన చేశారు. వీసీ ఆచార్య కె గంగాధరరావు యోగా ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ఆవశ్యకతను మనం గుర్తించడంతోపాటు, సమాజానికి అవగాహన కల్పించాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, ఆచార్య పి సిద్దయ్య, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ప్రజలకు వెన్నుపోటు

- హామీలు నెరవేర్చకుండా ప్రగల్భాలతోనే సరి
- అక్రమ కేసులు, అరెస్టులే తప్ప అభివృద్ధి శూన్యం
- జూన్ 4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, చిత్రంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తికావస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏ వర్గానికి న్యాయం చేయలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం చీరాల రామకృష్ణాపురంలోని పార్టీ కార్యాలయంలో చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అమలు కాని ఎన్నో హామీలను ప్రజలకు చెప్పి అధికారం చేపట్టిందన్నారు. సంవత్సర కాలం పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్ట్‌లతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులపై కేసులు బనాయించి అరెస్ట్‌ల పర్వానికి తెర తీశారన్నారు.

ప్రగల్భాలు చెప్పకునేందుకే మహానాడు

తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహించిన మహానాడు కార్యక్రమాన్ని చూస్తే ప్రగల్భాలు చెప్పుకునేందుకే నిర్వహించినట్లుగా ఉందన్నారు. ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకునేలా మహానాడు నిర్వహించారా అని ప్రశ్నించారు. సంవత్సర కాలంలో ప్రజలకు ఏం చేశామో చెప్పాలి గాని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడంతో చేయడంతోనే సరిపెట్టడం ఏంటన్నారు. నిరుద్యోగులకు ఎటువంటి రిక్రూట్‌మెంట్ ఇవ్వలేదని, రైతుల కన్నీటి గోడు కూడా వినలేని విమర్శించారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుందని కనిపించడంలేదా అని ప్రశ్నించారు. పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు ప్రాంతాల్లో పొగాకు రైతులు పడుతున్న కష్టాల కన్నీళ్ల గోడు ఈ ప్రభుత్వానికి వినిపించడం లేదన్నారు. గత ప్రభుత్వం పొగాకును ఎంతకు కొనుగోలు చేసిందో చూడాలన్నారు. కౌలు రైతులు, మిర్చి రైతుల గోడును మహానాడులో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. రైతుల సమస్యలపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని, పొగాకు రైతుల వద్దకు వెళితే వారు చెప్పే సమస్యలు వింటే ఎంతగా నష్టపోతున్నారో తెలుస్తుందన్నారు.

కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ నియోజవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ సంవత్సర కాలం వేచి చూశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కర్నేటి వెంకటప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు బత్తుల అనిల్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ కబీర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూన్ 4న వెన్నుపోటు దినం

హామీలు గాలికి.. కుట్రలు బయటకు..

చెరుకుపల్లి: ప్రజలకు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, అయితే బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయినా ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. శుక్రవారం గుళ్ళపల్లిలోని డాక్టర్ ఈవూరి గణేష్ క్యాంపు కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీన రేపల్లె ఆర్డీఓ కార్యలయం వద్ద నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరుతూ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో డాక్టర్ మేరుగ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు ఏడాది కాలంగా ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికొదిలి, తమ జేబులు నింపుకొనేందుకే వెచ్చించారన్నారు. కూటమి ఏడాది పాలనలో చిన్నారులను, మహిళలను, విద్యారంగాన్ని, వైద్యరంగాన్ని, చివరకు శాంతిభద్రతలను పట్టించుకోకుండా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. అనంతరం డాక్టర్ గణేష్ మాట్లాడేతూ 4వ తేదీ జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు దుండి వెంకట రామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, కరేటి శేషగిరిరావు, యార్లగడ్డ వెంకట రాంబాబు, నాయకులు డాక్టర్ హతిక్, పట్టెం శ్రీనివాసరావు, లుక్కా బాపనియ్య, నిజాంపట్నం కోటేశ్వరరావు, ఉల్లంగుంట శ్రీరాంమూర్తి, పాగోలు వెంకటేశ్వరరావు, కందుల సురేష్, చదలవాడ శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మోదుకూరులో మాట్లాడుతున్న డాక్టర్ మేరుగ నాగార్జున, చిత్రంలో అశోక్‌బాబు

అంతటా కూటమి వైఫల్యమే..

చుండూరు(వేమూరు): జూన్ నెల 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలోని ఎంఎస్ రెడ్డి జూనియర్ కళాశాలలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేరుగ నాగార్జున మాట్లాడుతూ జూన్ 4వ తేదీన నియోజకవర్గంలోని కొల్లూరు మండల కేంద్రంలో అశోక్‌బాబు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నియోజక వర్గంలోని వివిధ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. అశోక్‌బాబు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయకపోవడం ప్రజలకు వెన్నుపోటు పొడవటమేనన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అనపురెడ్డి రాఘురామి రెడ్డి, నాయకులు హిమ చంద్ర శ్రీనివాసరావు, దాది సుబ్బారావు, పడమటి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, నరేంద్ర, జాలాది రూబేను, చందోలు డేవిడ్ విజయకుమార్, షేక్ ఇమామ్ హుసేన్, పోతర్లంక సురేష్, గోపాలం రాము, పెరికల పద్మారావు, గాదె శివరామకృష్ణ రెడ్డి, వుయ్యూరి అప్పిరెడ్డి, బెల్లంకొండ శివ పార్వతి, దుండి పాలెం సర్పంచ్ భగవద్గీత, ఆవుతు రమణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలిలో దీపంలా వ్యవసాయం

- కంపెనీల చేతుల్లో ప్రభుత్వం
- ప్రతి ఏటా కంపెనీల లాభాలు పెరుగుదల
- రైతుల ఆదాయం తగ్గుదల
- నల్ల బర్లీ పొగాకు కౌలు రైతులు సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



తల్లపనేని శ్రీనాథ్ భార్య వందనతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

జె.పంగులూరు: దేశంలో రైతాంగ సంక్షోభానికి, వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వ విధానాలేనని, ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలిలో దీపంగా మార్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం మండలంలోని జనకవరం గ్రామంలో జరిగిన నల్లబర్లీ పొగాకు కౌలు రైతుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రైతాంగాన్ని ప్రోత్సహించిన ఐటీసీ, జీపీఐ కంపెనీలు నల్ల బర్లీ పొగాకును సాగు చేయించాయన్నారు. అయితే ప్రస్తుతం కంటికి కనిపించకుండా, కొనుగోలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాయన్నారు. రైతులది అత్యాశ అని వ్యవసాయ శాఖ మంత్రి అనడం సరైంది కాదన్నారు. మూడు నెలల కాలంలో షేర్ మార్కెట్‌లో ఐటీసీ, జీపీఐ షేర్లు నాలుగు శాతం పెరిగాయని, కానీ రైతుల ఆదాయం 40 శాతానికి పడిపోయిందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖమంత్రి చెప్పినా ఇంతవరకు కొన్న దిక్కులేదన్నారు. కౌలు రైతుల కోసం పని చేస్తామని ప్రగల్భాలు పలికిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పుడు అడ్రస్ లేడన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయిణి వినోద్‌బాబు, రైతు సంఘం సీనియర్ నాయకులు కందిమల్ల రామ కోటేశ్వరరావు, రైతు పాల్గొన్నారు.

శ్రీనాథ్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

అప్పుల బాధ భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న నల్లబర్లీ పొగాకు కౌలు రైతు తల్లపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జనకవరం గ్రామానికి చెందిన నల్లబర్లీ పొగాకు కౌలు రైతు తలనేని శ్రీనాథ్ ఈ నెల 24వ తేదీని పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠక విధితమే. దీంతో మృతుని కుటుంబాన్ని శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. ఆయన భార్య వందన, తల్లిదండ్రులు నరసమ్మ, హరిబాబుకు ధైర్యం చెప్పారు.

సేవల్లో 'ఫ్లోరెన్స్ నైటింగేల్'

- భారత రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయస్థాయి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న వలివేటి శుభావతి
- ఉభయ తెలుగు రాష్ట్రాల్నుంచి అవార్డు దక్కించుకున్న ఏకైక మహిళగా గుర్తింపు



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డును స్వీకరిస్తున్న శుభావతి

సంగం జాగర్లమూడి స్వస్థలం

తెనాలి: పవిత్రమైన వైద్యవృత్తిలో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే వృత్తిజీవితంలో సంతృప్తినే కాదు... ఏకంగా రాష్ట్ర, జాతీయ అవార్డులు కూడా వరిస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా శుక్రవారం జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును స్వీకరించిన వలివేటి శుభావతి ఇందుకు చక్కని నిదర్శనం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్నుంచి ఈ అవార్డును అందుకున్న ఏకైక మహిళ కూడా శుభావతినే. ఏఎన్‌ఎం విధుల్లో వైద్యవృత్తి ప్రాధాన్యతను గుర్తెరిగి, అంకితభావంతో నిర్వహిస్తూనే ఉన్నత కోర్సులు చేస్తూ, వరుస పదోన్నతులతో మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్ హోదాకు ఎదిగారు. ఇప్పుడు ఏకంగా జాతీయ అవార్డునే దక్కించుకున్నారు.

తెనాలి రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడి వలివేటి శుభావతి స్వస్థలం. తల్లిదండ్రులు సీతారావమ్మ, సుబ్రహ్మణ్యం. వైద్యరంగంలో తొలిగా ఉమ్మడి గుంటూరు జిల్లా నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలోని చందవరం సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎంగా శుభావతి వృత్తిజీవితం ఆరంభమైంది. ఉద్యోగ బాధ్యతల్లో ఉంటూనే పీజీ కోర్సులు చేస్తూ వచ్చారు. 13 ఏళ్ల సర్వీసులో మూడు పీజీలు చేశారు. ఫలితంగా పదోన్నతిపై ఇదే జిల్లాలోని నకిరేకల్‌లో హెల్త్ ఎడ్యుకేటర్‌గా నియమితులయ్యారు. అక్కడ 12 ఏళ్లపాటు పనిచేశారు. కర్నూలులోని రీజినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రెనింగ్ సెంటర్ (మేల్)కు మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ గత జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు.

ఎన్నో అవార్డులు.. రివార్డులు

ఆకాశవాణి, విజయవాడ కేంద్రం ఆహ్వానంపై బాల్య వివాహాలు, మాతాశిశు మరణాలు, బాలికా శిశు సంరక్షణ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక ప్రసంగాలు చేశారు. గుంటూరు జిల్లాలో బాల్య వివాహాల నిరోధంపై రిసోర్స్ పర్సన్‌గానూ వ్యవహరించారు. దీనిపై పలు పాటలు రాసి, స్వయంగా గానం చేశారు. అప్పట్లో నెల్లూరు జిల్లా కలెక్టర్లనుంచి అవార్డులను అందుకున్నారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు జిల్లా కలెక్టర్ సూచనపై ఓటరు అవగాహనపై పాట రాశారు. చెన్నైలో సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్‌తో స్వరకల్పన చేయించారు. ఈ సందర్భంగా నాటి కలెక్టర్ రేఖారాణి ప్రశంసాపత్రం అందించారు. రక్తహీనతపై అవగాహన కోసం పాట రాశారు. శ్రీకాకుళంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ నిర్వహించిన సేవలకు అవార్డులు దక్కాయి. గత ప్రభుత్వ హయాంలో శానిటేషన్, న్యూట్రిషన్‌పై శుభావతి రాసిన పాట పాపులరైంది. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఏఎన్‌ఎంల పుస్తకంలో తొలి పేజీలోనే ఆ పాటను ముద్రింపజేశారు. ఏపీ కల్చరల్ అవేర్‌నెస్ రాష్ట్రస్థాయి ఉత్తమ పౌరురాలి అవార్డు, శ్రీకాకుళంలో ఆంధ్రరత్న అవార్డు వంటివెన్నో తనకు అలంకారాలుగా మారాయి. భర్త ప్రైవేటు ఉద్యోగి, ఏకైక కుమారుడు హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ హాస్పటల్‌లో పని చేస్తున్నారు. రిటైరయ్యాక సొంత జిల్లా గుంటూరులోనే స్థిరపడ్డారు.

పేద రోగులకు సేవలు

వైద్యరంగంలో తన 39 ఏళ్ల సర్వీసులో శుభావతి పేద ప్రజలు, అవసరమైన వారికి తగిన సేవలను అందిస్తూ వచ్చారు. తన సమర్థత, నిబద్ధతను గుర్తించిన ఉన్నతాధికారులు అప్పగించిన అన్ని బాధ్యతలను ఆమె సక్రమంగా నిర్వర్తించారు. అనేక అవార్డులను అందుకున్నారు. నకిరేకల్‌లో ఉండగా, హెచ్‌ఐవీ/ఎయిడ్స్ ప్రాజెక్టుపై శుభావతిని నాటి జిల్లా కలెక్టర్ ప్రత్యేక శిక్షణకని ఢిల్లీ పంపారు. అదే ప్రాజెక్టుపై జిల్లాలోని ఆర్ఎంపీ/పీఎంపీలతో సహా ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని డిపార్టుమెంటు ఉద్యోగులకు శుభావతి హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఆ కృషికి గుర్తింపుగానే అప్పటి రాష్ట్రమంత్రి కొణిజేటి రోశయ్య నుంచి అవార్డును అందుకున్నానని శుభావతి చెప్పారు. ఎక్కడ పనిచేసినా నాతోటి సిబ్బంది, ప్రజలు ఎంతో ప్రేమను చూపటం నాకు గుర్తుండి పోతుందని అంటారు శుభావతి. 'ఎంతో కష్టపడి పనిచేశాను. అందరి మన్ననలు పొందాను. డబ్బు కోసం ఆశపడలేదు. స్వచ్ఛందంగా బాధ్యతలను నిర్వర్తించాను. ఇప్పుడు జాతీయ అవార్డు లభించిందంటే నా వృత్తి జీవితం మొత్తానికి అందిన గౌరవంగా భావిస్తున్నాను అన్నారు శుభావతి.

బాలలకూ విచ్చలవిడిగా మద్యం సరఫరా

- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు
- యథేచ్ఛగా పర్మిట్ రూముల ఏర్పాటు
- మైనర్లకు మద్యం సరఫరా చేస్తున్న వైనం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు



నరసరావుపేటలోని ఓ వైన్స్‌లో మద్యం తాగుతున్న మైనర్లు

నరసరావుపేట టౌన్: ఉజ్వలంగా వెలగాల్సిన విద్యార్థుల జీవితాలు కూటమి ప్రభుత్వ ధనదాహం, అధికారుల మామూళ్ల మత్తులో చిత్తవుతున్నాయి. వైన్ షాపు నిర్వాహకులు కక్కుర్తితో టీనేజ్ కూడా దాటని పిల్లలతో బహిరంగంగా మద్యం తాగిస్తున్నారు. పర్మిట్ రూములకు అనుమతులు లేకపోయినా.. ఏకంగా కుర్చీలు, బల్లలు వేసి పిల్లలకు మద్యం సరఫరా చేస్తూ వారి జీవితాలను చీకట్లోకి నెట్టేస్తున్నారు.

జీవితాలతో చెలగాటం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రైవేటు వ్యక్తులు చేతుల్లోకి తీసుకెళ్లింది. వారికి టార్గెట్లు ఇచ్చి మరీ మద్యం అమ్మకాలకు తెరతీసింది. ఈ క్రమంలో వైన్స్ నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లు మద్యం విక్రయాలు చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతులు లేకుండానే పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తున్నారు. వేళాపాళా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

ఆదాయమే పరమావధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాలను సర్కారే నిర్వహించేది. ఆ క్రమంలో ప్రజలను మద్యానికి దూరం చేసేందుకు ప్రయత్నించింది. తద్వారా యువత మద్యం జోలికి వెళ్లకుండా కట్టడి చేయగలిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చివరకు మైనర్లకు కూడా మద్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. నరసరావుపేట రావిపాడు రోడ్డులోని ఓ వైన్ షాపులో అనుమతులు లేకుండానే పర్మిట్ రూము ఏర్పాటు చేశారు. ఇక్కడ 18 ఏళ్లు కూడా నిండని బాలలు మద్యం తాగుతూ కనిపించారు. మైనర్లకు మద్యం విక్రయించరాదనే నిబంధనలను నిర్వాహకులు తుంగలో తొక్కారు. వీటిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పర్చూరు నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాలు చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నియోజకవర్గంలో ఆయా విభాగాల అధ్యక్షులుగా కొల్లా శేషగిరి(యూత్), జువ్వా కోమలరాణి (మహిళ), మలినీడి జగన్నాథం (రైతు), కొమ్మనబోయిన వాసు (బీసీ సెల్), నూతలపాటి బలరాం(ఎస్సీసెల్), భూక్యా పూర్ణానాయక్ (ఎస్టీ సెల్), షేక్ ఆయేషా (మైనార్టీ సెల్), పూరిమెట్ల జాన్‌బాబు (క్రిష్టియన్ మైనార్టీ సెల్), కాటి లక్ష్మణ్ (విద్యార్థి), ఆసోది బ్రహ్మానందరెడ్డి (పంచాయతీ రాజ్), కుంచపు అంకమ్మ (ఆర్‌టీఐ), వై.లక్ష్మి (వలంటీర్), యార్లగడ్డ వెంకటేశ్వరరావు (గ్రీవెన్స్ సెల్), ముప్పవల రాంబాబు (వాణిజ్యం), కోటి నాగులు (వీవర్స్), తన్నీరు సూరిబాబు (వైఎస్సార్ టీయూసీ), మేకల రవీంద్రనాథ్ రెడ్డి(లీగల్ సెల్), లంకా వెంకట శివ(కల్చరల్), కొమ్మూరి చందు (సోషల్ మీడియా), జి. రవిచందర్ (ఐటీ), కొమ్మెర శ్రీను (దివ్యాంగుల), షేక్ ఇమ్రాన్ (డాక్టర్స్), దాసరి వెంకటరావు (ప్రచారం), భవనం హరేరామరెడ్డి (ఇంటలెక్చువల్ ఫోరం), ముప్పాళ్ల రాఘవయ్య(బూత్ కమిటీ)లను నియమించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



చెరుకుపల్లి: లారీ, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన చందోలు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మోరవాగుపాలెం నుంచి చందోలు వైపు లారీ వస్తోంది. అదే సమయంలో మచిలీపట్నం నుంచి నెల్లూరు వైపునకు వెళ్తున్న బొలెరో చందోలు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ సమీపంలోకి వచ్చింది. రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ పక్కనే ఉన్న పొలాలలోకి పల్టీ కొట్టగా, బొలెరో వాహనం రహదారిపై బోల్తాపడి నుజ్జునుజ్జు అయింది. బొలెరోలో ఉన్న డ్రైవర్ దుర్గారావుకు తీవ్రగాయాలు అయ్యాయి. క్లీనర్ చంద్రమౌళి స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం రామకృష్ణాపురంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున హాజరయ్యారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్‌గా పెట్టుకుని అక్రమ కేసులు, అరెస్టులతో కాలం వెళ్లదీస్తోందన్నారు. నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ సాగిస్తున్న అరాచక పాలనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యకర్తలకు ఎప్పుడూ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అన్ని వర్గాలకు అన్యాయమే

పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగితే దాటవేత ధోరణితో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరుగుతోందన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. కౌలు రైతులు, పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను సుపరిపాలన అందించాలన్నారు. అరాచక పాలనపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని అందరూ విజయవంతం చేయాలన్నారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కర్నేటి వెంకటప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు బత్తుల అనిల్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ కబీర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

సజ్జా వెంకట నాగేశ్వరరావు సంస్మరణ సభలో ప్రజా సంఘాల ఆరోపణ



సంస్మరణ సభలో ప్రజా సంఘా ప్రతినిధులు

చీరాల రూరల్: అటవీ సంపదను విదేశీ కంపెనీలకు దోచిపెట్టడం కోసం దేశ పౌరులను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా హత్యలు చేయిస్తోందని అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. అందులో భాగంగానే సజ్జా వెంకట నాగేశ్వరరావు హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాండ్రపేట చౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపం ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో సజ్జా వెంకట నాగేశ్వరరావు సంస్మరణ సభను అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు సోదరుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నాగేశ్వరరావు విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే రాడికల్ ఉద్యమానికి ఆకర్షితుడై ప్రజల కోసం ఉద్యమ బాట పట్టినట్లు చెప్పారు. తన ఊపిరి ఉన్నంత వరకు ప్రజలకు కోసం పోరాడి ప్రాణత్యాగం చేసినట్లు పేర్కొన్నారు. పౌర హక్కుల సంఘం నాయకుడు చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకపక్క ఇతర దేశాలతో శాంతి చర్చలు జరుపుతూ మరోపక్క మన దేశంలోని పౌరులను ఎటువంటి చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో నరహత్య చేస్తోందని మండిపడ్డారు. కగార్ పేరుతో అనేకమందిని పొట్టనపెట్టుకున్న కేంద్రం 1,27,000 చెట్లను నరికివేసేందుకు పర్యావరణ అనుమతులు పొందడం అందులో భాగమేనని ఆయన ఆరోపించారు. హైకోర్టు న్యాయవాది యూడీ భీమ్‌రావ్ మాట్లాడుతూ ఎదురు కాల్పుల పేరుతో చంపిన దేశ పౌరుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయించామన్నారు. కనీసం కుటుంబ మృతదేహాలను చూపకుండా కేంద్రం నిరంకుశత్వంగా వ్యవహరిస్తూ కోర్టు ధిక్కారానికి కూడా పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చీరాల సాధన సమితి నాయకుడు శీలం రవికుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గొంతెత్తి ప్రశ్నించినవారు అర్బన్ నక్సలైట్, మావోయిస్టులయితే తాము కూడా అలాంటి వారిమేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకుడు దేవన వీర నాగేశ్వరరావు, బీసీ ఫెడరేషన్ నాయకుడు ఊటుకూరి వెంకటేశ్వర్లు, సీపీఎం న్యూడెమోక్రసీ మేకల ప్రసాద్, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం నాయకుడు వై. వెంకటేశ్వర్లు, నిర్బంధ వ్యతిరేక పోరాట కమిటీ రవిచంద్ర, భారత్ బచావో నవజ్యోతి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా ర్యాలీ నిర్వహించారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు

కర్లపాలెం: డ్వాక్రా స్వయం సహాయక సంఘాలలోని ప్రతి మహిళ లక్షాధికారి కావాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేసేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తుందని చెప్పారు. మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారికి కావాల్సిన రుణాలు మంజూరు చేసేందుకు సూక్ష్మరుణ ప్రణాళికలను తయారు చేసినట్లు చెప్పారు. మహిళలు వ్యాపారం, వ్యవసాయం, సేవా రంగాలతో పాటు కుటుంబ అవసరాలకు వారు కోరినంత రుణాలను బ్యాంకుల ద్వారా శ్రీ నిధి ఉన్నతి, సీఐఎఫ్‌ల ద్వారానే కాక ఇతర ప్రభుత్వ శాఖల నుంచి సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తారని చెప్పారు. మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సిబిల్ స్కోర్ పెంచుకునే విధంగా కృషి చేయాలన్నారు. సిబిల్ స్కోర్ సక్రమంగా ఉంటే గ్రూపు రుణాలతోపాటు ఉమెన్ లెడ్ ఎంటర్ ప్రైజస్ కింద కోరినంత రుణాలివ్వటానికి బ్యాంకర్లు అనుకూలంగా ఉన్నారని పీడీ చెప్పారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మహిళలకు ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో తమ ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రూ.2.10లక్షల రుణం మంజూరు చేస్తుందని దీనిలో రూ.78వేలు సబ్సిడీ పోగా రూ.1.32లక్షలు ఐదు సంవత్సరాలపాటు వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చని తెలిపారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవటం వలన గృహ విద్యుత్ వినియోగంలో తక్కువ బిల్లు వస్తుందని మన దగ్గర ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించటం ద్వారా అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. సమావేశంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, సమైఖ్య ప్రతినిధులు నసీమా, శివలీలా, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఇండియన్ బ్యాంక్ డీజీఎం గౌరీశంకర్, బ్యాంకు మేనేజర్లు, యూనియన్ బ్యాంక్ మానస, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రత్నజ్యోతి, సీసీలు శివప్రభ, రాఘవ, డ్వాక్రా సమైఖ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చందన్ నాగ్



రేపల్లె: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన మేరుగ చందన్ నాగ్ నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఈ ఉత్తర్వులను విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తనయుడు చందన్ నాగ్ ఇప్పటివరకు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా ఉన్నారు. రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా నియమితులు కావడంతో పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో చోటు

పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన పార్టీ అనుబంధ విభాగ కమిటీలలో బాపట్ల జిల్లాకు చెందిన పలువురు నేతలకు చోటు లభించింది. రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీగా బాపట్లకు చెందిన నక్క వీరారెడ్డి, రాష్ట్ర యువజన విభాగ సెక్రటరీగా బాపట్లకు చెందిన దొంతిబోయిన జయ భరత్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగ అధికార ప్రతినిధిగా రేపల్లెకు చెందిన నీలం వీరేంద్రనాథ్ , రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రటరీలుగా అద్దంకికి చెందిన సి.రాజ్ కుమార్, వేమూరుకు చెందిన జల్లి జోషికాంత్, పరుచూరికి చెందిన ఉప్పలపాటి అనిల్ చౌదరి, రాష్ట్ర వలంటీర్స్ వింగ్ సెక్రటరీగా అద్దంకికి చెందిన కొల్లి వెంకటరావు, రాష్ట్ర వాణిజ్య విభాగ జాయింట్ సెక్రటరీగా వేమూరుకు చెందిన మద్దుల గిరిధర్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది.

ప్రధానోపాధ్యాయులకు ఉద్యోగోన్నతి ధ్రువపత్రాలు అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ, మున్సిపల్, నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఉద్యోగోన్నతులపై నియమితులైన ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ధ్రువపత్రాలు అందజేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి జనరేట్ అయిన ఉద్యోగోన్నతుల ధ్రువపత్రాలను హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్ఎం ఏ.తిరుమలేష్, హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన షేక్ మొహ్మద్ ఖాసిం పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతుల్లోనే పిల్లల ఆరోగ్యం



మాట్లాడుతున్న జయలక్ష్మి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడా సాధన ఎంతో కీలకమని ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి తెలిపారు. ఇది పూర్తిగా తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియం సింథటిక్ కోర్టులో అండర్-16 ఓపెన్ బాలబాలికల టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జయలక్ష్మి మాట్లాడుతూ కొందరు తల్లిదండ్రులు చదువులకిచ్చే ప్రాధాన్యత పిల్లల ఆరోగ్యానికి ఇవ్వడం లేదన్నారు. దీంతో పిల్లల్లో అధిక శాతం ఊబకాయ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. జంక్ ఫుడ్‌తోపాటు మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వీలైనంత వరకు వారికి దూరంగా ఉంచాలని సూచించారు. టెన్నిస్ విలువ తెలిసిన సీనియర్ ఆటగాడు ఎస్.రామకృష్ణ ఈ టోర్నమెంట్‌ను స్పాన్సర్ చేయడం అభినందనీయం అన్నారు. పోటీల నిర్వాహకుడు షేక్ అహ్మద్ మాట్లాడుతూ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. మొత్తం 36 మంది చిన్నారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం పోటీలను జయలక్ష్మి., రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ బీఎన్ఎన్ మూర్తి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, ఎస్.సాంబశివరావు, జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



చికిత్స వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, కిరణ్‌కుమార్, వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడినట్లు జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మాదారం గ్రామానికి చెందిన పాలిపోగు ప్రసాద్ (62) రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. తీవ్రమైన కడుపునొప్పి, కామెర్లు, చలిజ్వరం రావడంతో ఒంగోలులో 25 రోజులు చికిత్స తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. హైడాటిడ్ సిస్ట్ వ్యాధి (కాలేయంలో నీటిబుడ్డ)తో బాధపడుతున్నట్లు నిర్ధారించామన్నారు. కుక్కల వల్ల, కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధి వస్తుందన్నారు. కొన్నిసార్లు మాంసం పూర్తిగా ఉడకకుండా తినడం వల్ల కూడా వస్తుందని చెప్పారు. ప్రసాద్ కాలేయం, ఇతర అవయవాలకు ఇబ్బంది ఉండటంతో సర్జరీ చేశామని, దీనికి నాలుగు గంటల సమయం పట్టిందన్నారు. సుమారు 40 రోజులపాటు వార్డులో చికిత్స అందించి డిశ్చార్జి చేశామన్నారు. సుమారు రూ.10 లక్షల ఖరీదైన ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. ఆపరేషన్ ప్రక్రియలో వైద్యులు నాగ సంతోష్‌కుమార్, సాదిక్ బాషా, వేణుగోపాల్, మేఘన, అవిన్, హరి, పోలయ్య, శ్యాంసన్, శ్వేత, ప్రసాద్, హనుమంతరావు, నర్సింగ్ సిబ్బంది రాజ్యలక్ష్మి, స్రవంతి, అనిత, ఉష, నంద పాల్గొన్నట్లు వెల్లడించారు. వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ అభినందించారు.

పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్

తెనాలి రూరల్: లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నిరాటంకంగా అమలు చేస్తూ దళిత, మైనార్టీ యువకులపై విచక్షణారహితంగా దాడి చేసిన సీఐలు, ఇతర పోలీసు సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి అందే శ్యాం డిమాండ్ చేశారు. తెనాలి ఐతానగర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వారు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

పొగాకు.. ఆరోగ్యానికి చేటు

- నేడు నో టుబాకో డే
- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- పొగాకు వినియోగంతో అనేక నష్టాలు



పొగాకు అలవాటు మానేయాలనుకునే వారికి ఔషధాలు

గుంటూరు మెడికల్: యవ్వనంలో సరదా కోసం మొదలుపెట్టే ధూమపానం చివరకు ప్రాణాలనే హరిస్తుంది. సిగరెట్, బీడీ, చుట్ట తాగే అలవాటు వ్యసనంలా మారి మనిషిని బానిసను చేసుకుంటుంది. స్మోకింగ్, పొగాకు ఉత్పత్తుల మోజులో పడి యువత భవిష్యత్తును అంధకారం చేసుకుంటోంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులలో 40 శాతం మంది పొగతాగటం, పొగాకు ఉత్పత్తులు వాడటం ద్వారానే వ్యాధి బారిన పడి మరణిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ధూమపానంతో కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రపంచ వ్యాప్తంగా మే 31వ తేదీన నో టుబాకో డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

జిల్లాలో బాధితులు అధికమే...


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం 35 శాతం మంది యువత ధూమపానం చేస్తున్నారు. వివిధ రోగాలతో 30 - 39 ఏళ్ల వయస్సు వారిలో చనిపోతున్న ప్రతి ఐదుగిరిలో ఒకరు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్లేనని తేలింది. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి నెలా 1,200 మంది పురుషులు, 2 వేల మంది మహిళలు వివిధ రకాల క్యాన్సర్‌లతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 శాతం మంది కేవలం పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డారు. జిల్లాలో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందించేందుకు 15 ఆస్పత్రులు, క్లీనిక్‌లు ఉన్నాయి. వీటిల్లో రోజూ 400 మంది వరకు క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు.

చట్టం ఏం చెబుతోందంటే..

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం రైల్వే స్టేషన్‌లు, సినిమా హాల్స్, బస్ స్టేషన్‌లు, జనసంచారం ఉండే మార్కెట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదు. ముఖ్యంగా పాఠశాలలు, గుడులకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మటం చట్టరీత్యా నేరం. 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు చట్టరీత్యా విక్రయించకూడదు. చట్టాన్ని అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తారు. ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో మాత్రమే ధూమపానం చేసేందుకు అనుమతించాలి.

జీజీహెచ్‌లో ఉచిత కౌన్సెలింగ్

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో పొగాకు ఉత్పత్తుల అలవాటు మానేయాలనుకునే వారికి ఉచితంగా కౌన్సెలింగ్ చేసి, ఔషధాలు ఇస్తున్నారు. 2019 నుంచి డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది 1,263 మందికి చికిత్స అందించడం ద్వారా కొంత మంది స్మోకింగ్ అలవాటు మానేశారు. స్మోకింగ్ అలవాటు ఉన్నవారికి ఛాతీ ముందు భాగంలో, భుజానికి, తొడకు.. ఇలా ఏదైనా ఒక ప్రదేశంలో వెంట్రుకలు లేని చోట నికోటిన్ ట్రాన్స్‌థర్మల్ ప్యాచ్‌ను అంటిస్తారు. ఈ ప్యాచ్ అంటించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా ప్రతి నెలా పది మందికి పైగా పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానివేస్తున్నట్లు గుర్తించామని సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్ తెలిపారు.



నో టుబాకో డే పోస్టర్

పొగాకు వినియోగంతో క్యాన్సర్



క్యాన్సర్ చికిత్స కోసం వచ్చే వారిలో 40 శాతం మంది పొగాకు, దాని ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్‌కు గురవుతున్నవారే. పొగతాగటం, పొగాకు ఉత్పత్తులైన ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి వాటిని వినియోగించటం వల్ల నోరు, గొంతు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, మూత్రాశయ క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నేడు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. చికిత్స తీసుకుని త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

ధూమపానంతో గుండెజబ్బులు



పొగతాగే వారిలో రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పొగాకులో 400 రకాల విషపదార్థాలు ఉంటాయి. కార్బన్ మోనాక్సైడ్ వల్ల గుండెపోటు, టార్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. నపుంసకత్వం, పక్షవాతం పొగరాయుళ్లను వదలవు. పొగతాగే వారికి చుట్టుపక్కల ఉన్నవారిపై కూడా పొగాకు ప్రభావం ఉంటుంది. గుండె జబ్బులతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చే వారిలో 70 శాతం మంది ధూమపానం చేసేవారే.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రకృతి పంచిన అరుదైన వనరులను మనం జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం జిల్లాలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని కన్జర్వేటివ్ రిజర్వ్‌గానూ, మేడికొండూరు మండలం, సిరిపురం గ్రామంలోని మంచినీటి చెరువును చిత్తడి నేలగానూ మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు పంపామన్నారు. వీటిని గ్రామ సభల ద్వారానూ సంబంధిత శాఖాధికారుల ద్వారా ఆమోదం లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో డీపీఓ సాయి కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, అధికారులు పాల్గొన్నారు.